సంపుటి: 1 | సంచిక: 6

సెప్టెంబర్ - అక్టోబర్, 2013

# దేవుని స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక

**నీ భారము యెహోవా మీద మోపుము.**

**ఆయనే నిన్ను ఆదుకొనును.**



# “మనస్సులోని మాట”

**క్రీస్తుయేసునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.**

స్పర్శ పాఠకులైన వారికి ప్రభువైన యేసుక్రీస్తు నామములో వందనములు.

మీలో ప్రతి ఒక్కరికి యేసు నామములో సమాధానము కలుగును గాక అని ప్రార్థించుచున్నాను. మీ జీవితములలో దేవుడు చేసిన మేలులన్నింటిని బట్టి ఎల్లప్పుడు ప్రభువుని స్తుతించుడి.

రాష్ట్రములో విస్తారముగా వర్షములు పడుట వలన అనేక ప్రాంతములలో వ్యవసాయమునకు ఇబ్బంది లేకుండా ఉండుట ఆనందకరమైన విషయము. రైతులు పండిస్తున్న పంట సమృద్ధిగా పండి వారికి దీవెనకరంగా ఉండాలని దేవుని వేడుకుందాము.

మనము ఉన్నతమైన విలువలతో కూడిన జీవితమును జీవిస్తూ, ఏ విధంగాదేవునికి సమాజమునకు ప్రయోజనకరంగా ఉండాలి అని తెలుసుకొనుటకు శ్రద్ధగా దేవుని వాక్యమును పరిశీలించవలయును. బైబిల్ గ్రంథము మనకు మంచివారికే మంచి చేయమని, చెడ్డవారిని విడిచి పెట్టమని చెప్పుట లేదు కాని అనేకమంది క్రైస్తవులు కేవలం మేలుకు మేలు, కీడుకు కీడు అన్నట్లుగా వ్యవహరించడం ఎంతో శోచనీయం. కీడును మేలుతో జయించమని చెప్పిన యేసయ్య మాటలను చదువుకొనుటకు మాత్రమే కాక జీవితములో నెరవేర్చుటకు అని గ్రహించవలెను. మీరు ప్రతి స్థలములో, ప్రతి ఒక్కరితోను ఎల్లప్పుడూ సమాధానకరమైన స్థితిని కాపాడుకొనుటకు శ్రద్ధ గలవారవై ఉండవలయును అని కోరుకొనుచున్నాను.

అట్టి ధన్యత దేవుడు అనుగ్రహించును గాక !

మీ సహోదరుడు.....



సంపుటి: 1 | సంచిక: 6 సెప్టెంబర్- అక్టోబర్, 2013

# దేవుని స్పర్శ

ఈ సంచికలో...


- ప్రభువు నిమిత్తము ........ 2
- ఆశావాది ........ 5
- వ్యక్తిత్వం (స్త్రీల ప్రత్యేకం) ........ 6
- కాలి, కొలంబియా ........ 9
- సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర - 30వ భాగము ........ 11
- మంచి మిత్రులు (బాలల శీర్షిక) ........ 13
- నా జీవితంలో చేసిన మేలులు (సాక్ష్యము) ........ 15
- జొనాతన్ ఎడ్వర్డ్స్ ........ 17
- ప్రార్థన ఊపిరిపీల్చుట వంటిది ........ 19
- లోయలు ........ 21
- బైబిల్ క్విజ్-30 ........ 22
- జన్మదిన శుభాకాంక్షలు ........ 23


మా చిరునామా: ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.6, భాగ్యలత కాలని, వనస్థలిపురం,
హైదరాబాద్-500 070, ఫోన్: 040-2420 2227

# ప్రభువు నిమిత్తము

- బ్రదర్. ఎపఫ్రా

యేసుక్రీస్తుని విశ్వసించి ఆయనలో కొనసాగుతున్న వారిలో కొందరు ఎల్లప్పుడూ ప్రభువు వాక్యానుసారంగా దేవుని ప్రేమను అనేకులకు చూపించాలనే వాంఛతో ఉండెదరు. అయితే కొంతకాలం అయ్యేసరికి వారు ప్రేమించి మేలు చేసినవారిలో అనేకులు కృతజ్ఞతతో ఉండకపోవడం, స్వార్థపరులుగా ఉండటం చూచి ఎంతో అసంతృప్తికి గురి అవుతూ వుంటారు. అనేక సందర్భములలో మేలు పొందిన వారు  చెడ్డగా ప్రవర్తించుట చూచి మేలు చెయ్యాలనే తపనతో జీవించేవారు ఎంతో నిరాశతో కృంగిపోవుట చూస్తున్నాము. అయితే ఈలాంటి సమస్యలకు పరిశుద్ధ గ్రంథం చక్కటి సమాధానమును మనకు ఇస్తుంది.

**ప్రభువు వలన స్వాస్థ్యమును ప్రతిఫలముగా పొందుదుమని యెరుగుదురు గనుక, మీరేమి చేసినను అది మనుష్యుల నిమిత్తము కాక ప్రభువు నిమిత్తమని మనస్ఫూర్తిగా చేయుడి, మీరు ప్రభువైన క్రీస్తునకు దాసులైయున్నారు. - కొలస్సీ 3:24,25**

అనేక విషయములలో మనము ఏమి చేసినను ప్రభువు నిమిత్తము అనే విషయములో తప్పిపోవుచున్నాము, మనుష్యులకు చేయుచున్నాను అని తలంచుకొను చున్నాము. ఈవిధంగా అనుకొనినంత కాలము మనము సంతోషముగా ఉండలేము. ఎందువలనంటే భూమి మీద శరీరముతో ఉన్న ప్రతి వ్యక్తిలో ఏదో ఒక లోపము లేక బలహీనత మనకు కనబడవచ్చు. ఉదాహరణకు అంగవైకల్యముతో ఆర్థిక ఇబ్బందులలో ఉన్న వ్యక్తికి నీవు కొంచెము ధనము సహాయము చేసి ఆదుకోవాలని అనుకొనవచ్చు. అయితే అతను ఒక సిగరెట్ త్రాగుట నీవు చూచిన యెడల ఏవిధంగా ఆలోచించెదవు? మనలో అనేకులు నేను అనవసరంగా సహాయం చేసాను అని తలంచెదరు. అయితే అది మంచి లక్షణము కాదు. అతని అవసరతలో నీవు సహాయం చేసితివి గనుక ప్రభువు నిన్ను దీవిస్తాడు.




**ధర్మశాస్త్రమంతయు - నిన్ను వలె నీ పొరుగువానిని ప్రేమించుము అను ఒక్క మాటలో సంపూర్ణమై యున్నది. - గలతీ 5:14**

ఖచ్చితముగా మనము మన వలె మన పొరుగువానిని ప్రేమించాలి అనే విషయమును పరిశుద్ధగ్రంథము మనకు తెలియపరుస్తున్నది. మనము ఒకరికొకరము సేవించుకొనిన యెడల మనము సేవ చేసే ఆ వ్యకిక్తి ఎంతో సంతోషము కలుగుతుంది. ప్రతి విషయములోను మనవలె మన పొరుగువారిని ప్రేమించుటకు ప్రేమించబద్ధులై యున్నాము. మన పొరుగువారిని విమర్శనాత్మకమైన దృష్టితో చూడక, వారి స్థానములో మనలను

ఊహించుకొని ప్రతి నిర్ణయం తీసుకొనవలెను. అప్పుడు ప్రతి వ్యక్తి విషయంలోను మనము ఎంతో బాధ్యతాయుతంగా ఉండగలము.

మనము సాధారణముగా ఇతరులకు తప్పక చేయవలసిన సహాయం చేయకపోవుట వలన ఎన్నో ఆశీర్వాదములు పోగొట్టుకొనెదము. మనము సహాయం చేసినప్పుడు వారి నుండి ఏదో ఒక మెప్పు కొరకు ఎదురు చూస్తాము. కాని ఏది చేసినను ప్రభువు నిమిత్తమే అని వ్రాయబడిన వాక్యప్రకారము ప్రభువు నుండి బహుమానం కొరకు ఎదురుచూద్దాం. మీలో ఎవడైనను గొప్పవాడై యుండగోరిన యెడల వారు మీకు పరిచారము చేయువాడై యుండవలెను. మీలో ఎవడైనను ప్రముఖుడై యుండగోరిన యెడల వాడు అందరికి దాసుడై యుండవలెను.



**మనుష్యకుమారుడు పరిచారము చేయించుకొనుటకు రాలేదుగాని పరిచారము చేయుటకును, అనేకులకు ప్రతిగా విమోచన క్రయధనముగా తన ప్రాణము ఇచ్చుటకు వచ్చెననెను. - మార్కు.10:43-45**

ఇతరులను ప్రేమించి వారి అవసరతలలో సహాయం చేయుటకు మన శరీరముతో ఎంతో పోరాడవలసి ఉంటుంది. మనకు నచ్చిన వాటిని చేయుటకు పోరాటం ఉండకపోవచ్చు కాని, దేవుడు ఉద్దేశించినవి చేయడానికి శరీరమునకు, ఆత్మకు మధ్య ఎల్లప్పుడూ పోరాటం ఉంటుంది. దేవుడు మన జీవితములో సహాయపడుటకు లేక పరిచారము చేయుటకు ఇచ్చిన ప్రతి అవకాశములను మనము మనస్ఫూర్తిగా చేయవలెనని దేవుని వాక్యము చెప్పుచున్నది.

యేసుప్రభువు మత్తయి 25:34-45 వరకు చెప్పిన భాగములలో మీరు భోజనము పెట్టారు, దాహమునకు నీళ్ళు ఇచ్చారు, పరదేశినైన నన్ను చేర్చుకున్నారు, దిగంబరినైన నాకు బట్టలు ఇచ్చారు, రోగినైన, చెరసాలలో ఉన్న నన్ను పరామర్శించితిరి అని చెప్పాడు. వారు మేము ఎప్పుడు ఇవన్నియు చేసితిమి అని అడుగుచున్నారు, అయితే అవసరతలో ఉన్న వారికి చేసిన పరిచర్య నాకు చేసినట్లు అని చెప్పియున్నాడు.

మరికొందరినైతే, మీరు నాకు చెయ్యలేదు అని చెప్పినప్పుడు, వారు నీవు మా దగ్గరకి ఎప్పుడు వచ్చితివి? అని అడిగారు. ప్రభువు మిక్కిలి అల్పులైన ఈ నా సహోదరులకు మీరు చేయలేదు కనుక నాకును చేయలేదు అని చెప్పడం జరిగింది.

ఎంత ఆశ్చర్యము! అవసరతలో ఉన్నవారికి చేసిన సహాయం లేక ఉపచారము

దేవుడు ఎంతో విలువైనదిగా ఎంచుచున్నాడు. ఈ సంగతి క్రీస్తుని వెంబడించే అనేకులకు తెలియక పోవుట ఎంతో దుఃఖకరము. నిజమైన సంతోషము పొరుగువారికి మేలు చేయుటలోనే మనము పొందుకొనగలము. అది ప్రభువు మన కొరకు సిద్ధపరచినది. అందుకే ఆయన మన అందరికి మాదిరికరముగా ఉండుటకు తన శిష్యుల పాదములను సహితము నీళ్ళతో కడిగి తనను తాను తగ్గించుకొన్నాడు. ఒక మనుష్యుడు ఈలాగు తన్ను తాను తగ్గించుకొనుట, అనేకులకు పరిచారము చేయుట, సమాజములో ఎవ్వరూ ఉన్నతముగా చూడరు, కాని యేసుక్రీస్తు ఇది ఎంతో ఉన్నతమైనదిగా చూడటం జరుగుతుంది.

**మీలో అందరికంటె గొప్పవాడు మీకు పరిచారకుడై యుండవలెను. తన్ను తాను హెచ్చించుకొనువాడు తగ్గించబడును, తన్ను తాను తగ్గించుకొనువాడు హెచ్చింపబడును. - మత్తయి 23:11,12**

మనము ప్రేమించుట, మేలు చేయుట అనే స్వభావం వ్యక్తిగతముగా మనలను ఎంతో భయంకరంగా ద్వేషించే వారినైనను నిస్సహాయులుగా మార్చివేస్తుంది. ఇది ఒక అద్భుతమైన విషయం. మన జీవితములలో దేవుడు ఉద్దేశించిన విధంగా సాగిపోవుటకు ఈ విధమైన స్వభావం ఎంతో అవసరం.

కాబట్టి స్పర్శ పాఠకులైన మీరందరూ మనము చేయు ప్రతి పనిని దేవుని యొద్ద నుండి స్వాస్థ్యముగా ప్రతిఫలము పొందుదుమని గ్రహించి సమాజములో ఎవరికి ఎలాంటి మేలు చేసినను ప్రభువు నిమిత్తము అని గుర్తించవలయును. తద్వారా మనుష్యుల వలన మనకు ఎలాంటి అవమానము, నింద, వేదన, బాధలు కలిగినను ఎన్నడు వాటిని బట్టి కృంగిపోకుండా ఉండెదము. మన జీవిత కాలమంతా ఎవరు ఎలాంటి అవసరతను కలిగి ఉన్నారో, ఎవరికి ఏ విధమైన మేలు చేయవలసి ఉందో అర్థం చేసికొని ముందుకి కొనసాగవలెను.

మనలను మనం తగ్గించుకొనుట, కొన్ని సందర్భములలో జీవితములను త్యాగము చేసికొనుట కూడా అవసరం. దేవుడు మన పట్ల చూపిన ప్రేమ మనము ఇతరులకు చూపించుట, వారు ఆ ప్రేమను మరికొందరికి పంచుట వలన అందరము దేవుని వలన కలిగే ఆశీర్వాదము ద్వారా ఆనందముగా జీవించెదము.

అట్టి ధన్యత దేవుడు దయచేయును గాక !

# ఆశావాది

| ఆశావాది | నిరాశావాది |
|---|---|
| 1. ద్వేషించేవారిలో కూడా ప్రేమను చూస్తాడు | 1. ప్రేమించేవారిని కూడా అనుమానిస్తాడు |
| 2. క్రిందపడినా లేవడానికి ప్రయత్నం చేస్తాడు | 2. నిలిచియున్నా పడిపోతానని భయ పడతాడు |
| 3. చీకటిలో కూడా వెలుగు కొరకు చూస్తాడు | 3. వెలుగుపోయి చీకటి వస్తుందని ఆందోళన పడతాడు |
| 4. ప్రతి కష్టంలోనూ అవకాశాన్ని చూస్తాడు | 4. ప్రతి అవకాశంలోనూ కష్టాన్ని చూస్తాడు |
| 5. ఉన్న స్థితిని బట్టి సంతోషం కలిగి ఉంటాడు | 5. లేని స్థితిని తలంచుకొని కుమిలిపోతాడు |
| 6. దుఃఖపడుతూ కూడా సంతోషం కలుగుతుందని ఎదురుచూస్తాడు | 6. సంతోషించే సమయంలో కూడా దుఃఖసమయం వస్తుందేమోనని ఏడుస్తుంటాడు |
| 7. ఆనందంగా ఉంటాడు, తోటివారిని ఆనందంగా ఉంచుతాడు | 7. ఆనందంగా ఉండడు, తోటివారిని ఆనందంగా ఉండనివ్వడు |
| 8. దీవెనకరమైన మాటలు పలుకుతాడు | 8. శాపకరమైన మాటలు పలుకుతాడు |
| 9. ప్రయత్నిస్తే సాధించలేనిది ఏదీ లేదని నమ్ముతాడు | 9. సాధించకపోతే ప్రయత్నములు అన్నీ వ్యర్థమైపోతాయి అని అనుకుంటాడు |
| 10. ధైర్యముగా ఉంటాడు | 10. భయపడుతూ ఉంటాడు |



# వ్యక్తిత్వము

వ్యక్తి యొక్క తత్త్వమును వ్యక్తిత్వము అని అంటాము. దీనిని ప్రాథమికముగా నాలుగు భాగములుగా విభజించవచ్చు. 1. బాహ్య 2. మానసిక 3. భావోద్రేక 4. సామాజిక. కొందరు బాహ్య సంబంధమైన, మరికొందరు మానసిక సంబంధమైన, భావోద్రేక మరియు సామాజిక విషయములలో నిష్ణాతులుగా కనబడవచ్చు, కానీ నాలుగు కోణాల నుండి చూచినప్పుడే ఒక వ్యక్తిని సరియైన వ్యక్తిత్వంతో ఉన్నాడని చెప్పగలము. పై నాలుగు కోణములలో సమతూకం పాటించడమే నిజమైన వ్యక్తిత్వం అవుతుంది. మానవుని దేవుడు సరియైన వ్యక్తిత్వం కలిగి జీవించాలని కోరుకున్నాడు. కాలక్రమంలో లోకవిరోధి అయిన సాతాను అనేక విధములుగా మన వ్యక్తిత్వమును పాడుచేయుచూ మనలను ఎందుకూ పనికిరానివారిగా మారుస్తున్నాడు. వాడి తంత్రములను మనము గ్రహించి, దేవుని సహాయముతో, మన ప్రయత్నం ద్వారా ఒక మంచి వ్యక్తిత్వం గలవారిగా జీవించాలి. బైబిల్ గ్రంథములో ఉన్న కొంతమంది జీవితముల ద్వారా వ్యక్తిత్వములో ఉన్న మొదటి రెండు భాగములను గురించి గత సంచికలో చదువుకున్నాము. ఇప్పుడు మిగిలిన రెండు భాగముల గురించి ధ్యానించుకుందాము.

### 3. భావోద్రేక తత్త్వము :-

బాహ్య సౌందర్యముతో చక్కగా కనబడుతూ, చక్కగా మాట్లాడుతూ మరియు సరియైన సమయములో, సరియైన నిర్ణయం తీసుకుంటూ బావున్నారు అని అనుకునే వారిలో కూడా భావోద్రేకములు అదుపు చేసుకొనలేక ఆత్మహత్యా ప్రేరేపణలతో మరియు హత్య చేయాలనే ప్రేరణలతో ఎంతో ఆందోళనకరమైన పరిస్థితులను తమ జీవితములలో మరియు ఇతరుల జీవితాలలో కూడా కలుగ జేస్తారు.

బైబిల్ గ్రంథములో ఉన్న ఒక రాజు, ఒకానొక సమయములో తన రాజ్యములోని ప్రజలు తన కంటె ఎక్కువగా మరియొక వ్యక్తిని గౌరవించడాన్ని, ఆరాధించడాన్ని చూడలేక ఎంతో భావోద్రేకమునకు గురి అయ్యాడు. అతని భావోద్రేక స్థితి ఎంత వరకు అతనిని నడిపించిందంటే హత్య చేయుటకు కూడా వెనకడుగు వేయనంత పరిస్థితిని తీసుకువచ్చింది. అది మంచిది కాదు అని చెప్పిన కన్నకొడుకుని కూడా దూషించి, త్రోసివేసే స్థాయికి దిగజార్చింది. అతని పేరే సౌలు, తనను తక్కువ చేసి మాట్లాడుతున్నారు అనే సంగతి సౌలు తట్టుకోలేకపోతున్నాడు.

**ఆ స్త్రీలు గాన ప్రతి గానములు చేయుచు వాయించుచు - సౌలు వేలకొలదియు,**

దావీదు పదివేలకొలదియు (శత్రువులను) హతము చేసిరనిరి.

ఆ మాటలు సౌలునకు ఇంపుగా ఉండనందున అతడు బహు కోపము తెచ్చుకొని - వారు దావీదునకు పదివేల కొలది అనియు, నాకు వేలకొలది అనియు స్తుతులు పాడిరే, రాజ్యము తప్ప మరి ఏమి అతడు తీసికొనగలడు అనుకొనెను. కాబట్టి నాట నుండి సౌలు దావీదు మీద విషపు చూపు నిలిపెను. - 1 సమూ 18:7,9



మన జీవితములో కూడా అవమానం, హేళన, దూషణ, అన్యాయం జరగవచ్చు దానిని ఎవ్వరూ కాదనలేరు. కాని వాటిని బట్టి భావోద్రేకములను ఏ మాత్రము అదుపు చేసికొనకుండా ప్రవర్తించిన యెడల ఎంతో నష్టము మన జీవితములో లేక మన కుటుంబములలో సంభవిస్తుంది. కనుక భావోద్రేకములను అదుపులో ఉంచుకొనుట ఎంతో ముఖ్యమైనది. ఒక వ్యక్తిని శ్రేష్ఠమైన వానిగా తీర్చిదిద్దుటలో భావోద్రేకమునకు గురియైనప్పుడు అతను ఏ విధంగా తనని తాను నియంత్రించుకొనవలెనో తెలియపరచుట కూడా ఎంతో అవసరం.

**నీ భారము యెహోవా మీద మోపుము ఆయన నిన్ను ఆదుకొనును - కీర్తన 55:22**

## 4. సామాజిక తత్త్వము :-

ఒక వ్యక్తి తనను చూస్తున్న వారందరికి బాహ్య రూపములో, మానసిక స్థితిలో, భావోద్రేక పరిస్థితులలో సహితము ఎంతో సమతూకంగా కనిపించిననూ, అతనిలో సామాజిక తత్త్వము లేకపోవుట కూడా ఎంతో నష్టదాయకం. మరియు ప్రమాదకరం. ఎందుకనగా నేటి సమాజములో కొందరిని చూస్తున్నప్పుడు సామాజిక బాధ్యత ఏ మాత్రము లేక ఎన్నో కుంభకోణములు చేస్తూ దేశములను, దేశ ఆర్థిక వ్యవస్థలను ఛిన్నాభిన్నం చేస్తున్నారు. దాని పర్యవసానం సమాజములో ఎంతోమందికి తినడానికి ఆహారం కూడా దొరకని పరిస్థితులు సంభవిస్తాయి, జనము మీదికి జనము లేచుట వలన సమాజములో అశాంతికి కారణం అవుతుంది.

పరిశుద్ధ గ్రంథములో యోనా అనే ప్రవక్త లక్షల మంది ప్రజల క్షేమము కొరకు దేవుడు ఆలోచించి చేయమని చెప్పిన పనిని చేయకుండా, తన స్వంత ఇష్టమును నెరవేర్చుకొనుట కొరకు వెళ్ళిపోతున్నాడు. ఎవరికి ఏమి జరిగిననూ నాకు అనవసరం, నాకు అనిపించినదే నేను చేస్తాను అనే ధోరణితో యోనా జీవిస్తున్నాడు.

యోనా దీని చూచి బహు చింతా క్రాంతుడై కోపగించుకొని - యెహోవా, నేను నా దేశమందుండగా ఇట్లు జరుగునని నేననుకొంటిని గదా? అందువలననే నీవు కటాక్షమును జాలియును బహు శాంతమును అత్యంత కృపయుగల దేవుడవైయుండి పశ్చాత్తాపపడి కీడు చేయక మానుదువని నేను తెలిసికొని దానికి ముందుగానే తర్షీషునకు పారిపోతిని. - యోనా 4:1-3



నేడు కూడా ఇలాంటి విపరీత ధోరణి అనేకులలో కనిపిస్తున్నది అందుకే లంచగొండితనము, అవినీతి తారా స్థాయికి చేరుచున్నవి.

కాబట్టి మన జీవితములో ఒక మంచి వ్యక్తిత్వము కలిగి జీవించడానికి బాహ్య, మానసిక, భావోద్రేక, సామాజిక తత్త్వములలో సరియైన క్రమము కలిగి జీవించవలయును.

దేవుడు అట్టి జ్ఞానమును దీనిని చదువుచున్న ప్రతి ఒక్కరికి దయచేయును గాక !



**చందా వివరములు**

సంవత్సర చందా : రూ. 100/-లు.
జీవితకాల చందా : రూ. 2000/-లు.
విదేశములకు : సంవత్సరమునకు US $40.

పంపవలసిన మా చిరునామా:
ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.1, శాంతినగర్,
భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్-500070



# కాలి, కొలంబియా

మత్తు పదార్థాలు, హింసకు, ప్రతి విధమైన పాపానికి కాలి మారుపేరు. హింస తారాస్థాయికి చేరుతుంది. సంఘం దాని ఒత్తిడిని ఎదుర్కొంటుంది. అనేకులు డ్రగ్స్ యజమానుల కఠిన పాలనను అనుభవించారు. అనేక మంది డ్రగ్స్ యజమానులు పెద్ద ఎత్తున ఖరీదైన ఆస్థులను కొన్నారు. వారి వ్యాపార అకౌంటులోనికి డబ్బు ప్రవహిస్తుండగా వారు వ్యాపారాన్ని కొనసాగించారు. వారు సామాజిక – ఆర్థిక పరిస్థితులను, రాజకీయ పరిస్థితులను మరియు మత పరిస్థితులను కూడా అదుపు చేసారు. తన ముందు 5 వ్యక్తులు చంపబడటం చూశానని ఒక వ్యక్తి సాక్ష్యమిచ్చాడు. ఒక చిన్న వాగ్వాదానికి కూడా ఎవరైనా వీధుల్లో చంపబడటం ఆశ్చర్యం కాదు.

ఆ మార్పు ఎలా సంభవించింది? దేవుని నడిపింపు ప్రకారం రూతు రోయిబాల్ మరియు ఆమె భర్త హులియాస్ 1978లో కాలికి వచ్చారు. వారు పట్టణ పరిస్థితికి బిత్తరపోయారు. కాని దేవుని ప్రజలు గనుక ప్రార్థిస్తే శత్రువు పట్టు తెగిపోతుందని హులియా నమ్మాడు. నాయకుల మధ్య ఐక్యత లేదు. నాయకుల మధ్య ఉన్న విభజనను చూసి పాస్టర్స్ అసోసియేషను నుండి హులియా బయటకొచ్చాడు. కాని ప్రభువు అతనితో మాట్లాడినప్పుడు అతడు తిరిగి వచ్చి నాయకులందరిని క్షమించమని అడిగాడు. పట్టణంలో వ్యాపించిన చెడు అభ్యాసాలను బట్టి ప్రజలు ప్రార్థించడం మొదలుపెట్టారు. ఇది పని చేయదనే వ్యాఖ్యానాలు కూడా ఆరంభంలో వెల్లువెత్తాయి. ఇది మొదటిసారి 1995లో మొదలైంది. వారంతా కలిసి స్టేడియంలో సంపూర్ణ రాత్రి ప్రార్థనలో పాల్గొన్నారు. దేవుడు సంఘాలను కదిలిస్తాడని నమ్ముతూ క్రైస్తవుల మధ్య ఐక్యత కోసం మరియు దురాత్మ శక్తులకు విరోధంగా వారు ప్రార్థించారు.

ఐక్యతగల సంపూర్ణ రాత్రి ప్రార్థనలు సంస్థల మధ్య ఉన్న ఐక్యతకు వ్యక్తీకరణ. వారు పరిశుద్ధాత్మ చేత ప్రేరేపించబడి యేసు క్రీస్తు నామంలో పరలోక తండ్రి స్తుతి,

మహిమ, ఘనత కోసం కలిసి ప్రార్థించి విజ్ఞాపన చేయడానికి పూనుకున్నారు. దేవుని ప్రజలు 1996లో కాలి పట్టణం చుట్టూ కారులో ఏడుసార్లు ప్రార్థన డ్రైవ్ చేసినప్పుడు పట్టణం మీదున్న ఆత్మీయ వాతావరణం మారింది.

ప్రార్థన చేసిన 48 గంటల్లోనే నర హత్యల సంఖ్య తగ్గిపోయింది. కాలి పట్టణంలో ఒక వారమంతా ఒక హత్య కూడా జరుగలేదు. గతంలో ప్రతి రోజు సుమారు 15 హత్యలు జరిగేవి. డ్రగ్స్ యజమానులు పట్టుబడ్డారు. వారు ప్రభుత్వ అధికారుల చేత అరెస్టు చేయబడ్డారు. సంఘాలు జన సమూహాలతో నిండాయి. ప్రజలు దేవుని ముఖాన్ని వెదకడం మొదలుపెట్టారు. ఆ సమాజంలో అనేక మంది ప్రసిద్ధులు రక్షణ పొందారు. కాలి పట్టణంలో సంఘాల సంఖ్య చూస్తే 1980లో 30 నుండి 1990లో 250 పెరిగాయి. 1999లో ఆ సంఖ్య 600కి పెరిగింది. ఇదంతా సాధ్యమవ్వడానికి కారణం ప్రజలు తమ ప్రాంత, ప్రజల విషయంలో బాధ్యతను తీసుకొని ఐక్య హృదయాలతో విజ్ఞాపన చేయడం. ఇది సమాజంలో పరివర్తనకు దారి తీసింది.

మీ ప్రాంతంలో అలాంటి శక్తివంతమైన పరివర్తనను చూడాలని మీరు ఇష్టపడుతున్నారా? ఇది దేవుని కదలికను చూసేంత వరకు పట్టు వదలకుండా ప్రార్థించే ప్రజలతో సాధ్యమే. నిశ్చయంగా సాధ్యమే. దేవుని ముందు మోకరించి దేశాలను కంపింపజేసే బలమైన ప్రార్థనా యోధులుగా దేవుని సైన్యంలో భాగస్థులవ్వడానికి మీరు ఇష్టపడుతున్నారా?


రండి! పాల్గొనండి!! ఆశీర్వాదం పొందండి !!!

**2013 అక్టోబర్ 2వ తేది ఉపవాస ప్రార్థన**

దేశ క్షేమం, క్రైస్తవ సంఘాల ఉజ్జీవం,
కుటుంబముల ఆశీర్వాదము కొరకు దేవుని వేడుకుందాం.

**సమయం:** ఉదయం గం. 9.00 లకు
వివరములకు: బ్రదర్. రవీందర్, సెల్: 99631 17628



# సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర

**– సీరియల్ 30వ భాగము**

సుందర్ ఎంతో సంపూర్ణమైన వ్యక్తి నడవడిలోను, సాంప్రదాయంలోను, ఎంతో గౌరవంగాను, మర్యాదగాను, సామాన్యునిగాను జీవించాడు. వీధి ప్రసంగాలు చేయాలంటే పదిమందికి వినబడే స్వరం కూడా లేదు. అయిననూ ఇలాంటి పద్ధతి ఆయనకి అంతగా రుచించలేదు. తన చుట్టూ చేరిన చిన్న గుంపుతో భక్తి విషయాలు మాట్లాడడమంటే సుందర్‌కి ఎంతో ఇష్టం. దేవుడు ఫలాని స్థలమునకు తనను పిలిచాడని భావించనంత కాలం అచ్చటి క్రైస్తవులు ఏర్పాటు చేసిన బసలో ఉంటూ వారిచ్చినది భుజిస్తూ వాక్యమును ప్రకటిస్తుండేవాడు. వారిచ్చిన ప్రయాణ ఖర్చులతో ఆ తరువాత స్థలమునకు వెళ్ళేవాడు. బ్రతికి ఉంటే తన స్వజనులలోనే ఎంతో గొప్ప శక్తిగా ఉండేవాడు. సుందర్‌లాంటి వారింకా ఎక్కువ మంది లేవాలని ఆంగ్లికన్ సంఘానికి చెందిన ఓ ప్రముఖ పత్రికలో ప్రచురించారు. సిమ్లాలోని పరి.థామస్ గుడిలో సుందర్ జ్ఞాపకార్థ కూటమును ఏర్పాటు చేసి, ఆయన జ్ఞాపకార్థం ఓ శిలా ఫలకమును నిలబెట్టాలని ఓ నిధి కూడా ఏర్పాటు చేశారు.

ఆ తరువాత సుందర్ ఇంకా బ్రతికే ఉన్నాడు. ఫిబ్రవరి 21న ఆనీఫీల్డ్ నుండి ఆయన వ్రాసిన ఉత్తరం ఇప్పుడే నాకందింది అంటూ కానన్ విగ్రాంగారు రెవ.జె.రెడ్మాన్‌కి వ్రాశారు. సుందర్‌కి ఇవేమీ తెలియదు. కట్టెలు నరికే ఇద్దరు మనుష్యులు అడవిలో బలహీనంగా కృశించి పడియున్న వానిని చూచి అతడు ఒక సాధువు అని గుర్తించారు. అతనిలో ఇంకా ప్రాణముండడంతో కొందరి దగ్గరకి అతనిని మోసుకొని పోయారు. వారేమో డెహ్రాడూన్ రైలెక్కించారు. ఎంతో కృశించిన సుందర్ రూపురేఖలు గుర్తు పట్టకుండ మారిపోయాయి. అయితే అదృష్టవశాత్తు ఆనీఫిల్డ్ గ్రామ క్రైస్తవులు ఇతనిని చూచి అతని దగ్గర ఉన్న క్రొత్త నిబంధనను బట్టి అతడు సుందర్ అని గుర్తించారు. తమ ఎడ్లబండిలో సుందర్‌ని ఫాదరిగారింటికి చేర్చారు. ఆహారమును జీర్ణించుకోగల శక్తి వచ్చేంత వరకు ఓ వారం రోజుల పాటు కేవలం ద్రవపదార్థములను మాత్రమే ఇచ్చారు. సుందర్ క్రమేపి నెమ్మదిగా కోలుకొన్నప్పటికిని తాను ఉపవాసముండిన దినముల లెక్క గాని ఆ దినములు ఎలా గడిచాయనే దానిని గూర్చి గాని స్పష్టమైన అవగాహన లేకుండినాడు. ఆనీఫీల్డ్ చేరిన 15 రోజుల తరువాత దేవుని నడిపింపు ప్రకారం 40 దినాలు ఉపవాసము ఉన్నాను, దీని

ద్వారా ఆత్మీయంగా ఎంతో మేలు పొందాను. దేవుని సంకల్పము వలన సరిగ్గా 40వ దినమున కట్టెలు నరికే కొద్దిమంది అడవిలోనికి వచ్చి నన్నిక్కడికి చేర్చారు. నేనెంతో బలహీనుడనుగా ఉన్నాను. ఇప్పుడు కొంచెం నడవగలుగుచున్నానని వ్రాశాడు సుందర్. ఋజువులన్నీ చూచిన తరువాత సుందర్ ఇరవై రోజులు మాత్రమే ఉపవాసములో గడిపాడని తెలిసింది. జరిగిన విషయములను సుందర్ నిర్దుష్టంగా చెప్పక పోవడం వలన ఆ తరువాత కాలములో ఆయనను విమర్శించే శత్రువులకిది మంచి సాధనమైపోయింది. అయితే తాను మాత్రం 40 దినములు ఉపవాసమున్నాననీ, తన యెడల అది దేవుని చిత్తమని అది నెరవేరినదని భావించాడు సుందర్.

తగినంత ఆరోగ్యం సమకూరగానే మరలా హిమాలయాల వైపు బయలుదేరాడు సుందర్. సిమ్లాకు చేరేంతవరకు కూడా తాను చనిపోయినట్లుగా పంపించబడిన తంతి వార్తల గురించి అతనికి తెలియలేదు. ఉపవాసానికి ముందు తాను సంప్రదించిన డాక్టరు ఈ తంతి వార్తలు పంపి ఉండవచ్చునని మాత్రమే చెప్పగలిగాడు. దీనంతటి వలన అతనిని గూర్చిన సమాచారం మునుపెన్నడూ లేనంతగా వ్యాపించింది. అతడు చనిపోయాడు అన్న వార్తలు ప్రజలలో అతని యెడల ఎంతో ఆసక్తిని రేకెత్తించాయి. వీటన్నిటి వలన పూర్వకాల ప్రవక్తలలో ఒకని వలె సుందర్ విశేషమైన వ్యక్తియై పోయాడు. ఇదంతా సుందర్‌కి ఎంతో ఇబ్బంది కలిగించింది.

ఆయన ఉపవాసం వలన పైకి కనబడిన ఫలితమలాగుండగా ఆత్మీయంగా చూస్తే సుందర్ జీవితములో ఇది ఎంతో ప్రాధాన్యమైన సంఘటన

సేకరించబడింది

(ఇంకా ఉంది)

**ఎపఫ్రా మినిస్ట్రీస్ - వనస్థలిపురం**

**ఆదివారం ఆరాధన సమయం ఉదయం 10 గం.లకు**

**వర్డ్ & డీడ్ స్కూల్ (హయత్ నగర్) NH-9,**

**ఛాపెల్ ఆడిటోరియం నందు జరుగును.**

*అందరూ ఆహ్వానితులే....!*

**వివరములకు:**

9666666249 | 040-24202227



# మంచి మిత్రులు

పిల్లలూ మన ఫ్రెండ్స్ ఒక్కొక్కసారి మనకి ఎంతో సహాయం చేసేవారిగా ఉంటారు. కొందరు ప్రాణం ఇచ్చేంతగా ఉంటారు. వారిని ఎన్నటికీ మర్చిపోకూడదు. కృతజ్ఞత కలిగి ఉండాలి . సౌలు మహారాజు దావీదు చేసిన సహాయం మరిచిపోయి చంపాలనుకున్నాడు కానీ అతని కుమారుడు ప్రాణస్నేహితునిగా ఉన్నాడు. ఆ స్టోరీ తెలుసుకుందామా !

పిల్లలకే కాదు పెద్దవాళ్ళకి కూడా స్నేహితులు ఉంటారు. దావీదు పెద్దయ్యాక అతనికి ఒక స్నేహితుడున్నాడు. అతని పేరు యోనాతాను. అతను చాలా ప్రత్యేకమైనవాడు. ఎందుకంటే అతను రాకుమారుడు. యోనాతాను దగ్గర చాలా వస్తువులు ఉన్నాయి. మంచి బట్టలు, తళ తళ మెరిసే కవచాలు, కత్తి, వజ్రాలు పొదిగిన నగలు, బాణాలు, విల్లు ఉన్నాయి. దావీదు అంటే యోనాతానుకు ఇష్టము. అందుకని తాను వేసుకున్న కొత్తబట్టలను దావీదుకు ఇచ్చేశాడు. ధగ ధగ మెరిసే కవచాలను, నగలను, విల్లు, బాణాలను, కత్తిని కూడా ఇచ్చేశాడు.



కొన్నిసార్లు యోనాతాను దావీదు కలిసి బాణాలు వేసేవారు. ఒక్కోసారి దేవుణ్ణి గురించి మాట్లాడుకునేవారు. దేవుని మాట వినాలని ఆ యిద్దరికీ ఉండేది. యోనాతాను తన వస్తువులన్నీ దావీదుకి ఇచ్చి తన ప్రేమను వ్యక్తం చేసేవాడు. అది రాజుకి ఇష్టం ఉండేది కాదు. వీరిద్దరూ స్నేహంగా ఉండటం అస్సలు నచ్చేది కాదు. ప్రజలే అనుకుంటే కన్నకొడుకు కూడా దావీదుని ఇష్టపడటం సహించలేకపోయాడు.

ఒకరోజు యోనాతాను తండ్రి అయిన రాజు చాలా చిరాకుగా, కోపంగా ఉన్నాడు. రాజుకు దేవుడంటే ప్రేమలేదు. అందరికీ దావీదు అంటే ఇష్టమైతే రాజుగారికి ఇష్టం లేదు. అందరూ తననే ఇష్టపడాలని ఉండేది. రాజు ఎలాగైనా దావీదును చంపాలని ఎదురు చూస్తూ ఉన్నాడు. ఈ విషయం యోనాతాను దావీదుకి చెప్పి నీవు వెళ్ళి దాక్కో, మా నాన్నకి కోపం తగ్గితే ఆయన మనస్సు మారవచ్చు. నిజంగా నిన్ను చంపాలని మా నాన్నకి ఉందో లేదో కనుక్కుంటాను. అన్నాడు యోనాతాను.

“నాకు ఎలా తెలియజేస్తావు ?” అన్నాడు దావీదు.

యోనాతాను ఆలోచించాడు. “పొలాల్లోకి రా” అన్నాడు. దావీదు వెళ్ళాడు. ఒకచోట పెద్దరాళ్ళ కుప్ప ఉంది. దావీదు అంత ఎత్తు ఉంది, వెడల్పుగా ఉంది. “నేనిప్పుడు ఏం చెయ్యాలి” అని దావీదు యోనాతానును అడిగాడు. “రేపు కాకుండా ఎల్లుండి వచ్చి ఆ రాళ్ళ వెనక దాక్కో” అన్నాడు యోనాతాను. “నేను నా బాణాలు తీసుకొని ఒక చిన్న పిల్లవాడిని వెంటబెట్టుకుని వస్తాను. ఒక బాణాన్ని గాలిలోకి వదులుతాను అలా మాటి మాటికి చేస్తాను. ఆ బాణాలు ఏరుకు రావడానికి ఆ పిల్లవాడిని పంపుతాను. ఇది జాగ్రత్తగా విను..” దావీదు యోనాతాను వంక చూస్తూ జాగ్రత్తగా వింటున్నాడు. “ఆ పిల్లవాణ్ని గట్టిగా పిలుస్తాను...బాణములు నీకు ఈ తట్టున నున్నవి, పట్టుకొని రమ్మని నేను వానితో చెప్పిన యెడల నీవు రాజు దగ్గరకు రావచ్చును అయితే, బాణములు నీకు అవతలనున్నవని నేను వానితో చెప్పిన యెడల రాజుకి చాలా కోపంగా ఉంది నువ్వు ఎక్కడికైనా పారిపో అని అర్థమన్నమాట”. దావీదు తలూపాడు. యోనాతాను రాజ భవనానికి వెళ్ళిపోయాడు. దావీదు దాక్కునేందుకు వెళ్ళాడు.

ఒకరోజు గడిచిపోయి మరొకరోజు వచ్చింది. దావీదు జాగ్రత్తగా వచ్చి రాళ్ళ కుప్ప వెనకాల దాక్కున్నాడు. త్వరగానే యోనాతాను అక్కడికి వచ్చాడు. యోనాతాను బాణాలు గాలిలోకి వేశాడు. “వెళ్ళి ఆ బాణాలు తీసుకురా” అని తనతో తీసుకు వచ్చిన పిల్లవానికి చెప్పెను. వాడు బాణాలు తెచ్చునంతలో బాణాలు “నీకు అవతలనున్నవని” అరిచాడు. ఈ మాట దావీదుకు వినబడింది. తాను చాలా దూరం పారిపోయి దాక్కోవాలని అతనికి అర్థమైంది. యోనాతాను తన ఆయుధములను ఆ పిల్లవాని చేతికిచ్చి వీటిని పట్టణమునకు తీసుకొని పొమ్మని చెప్పి వానిని పంపివేసెను.

దావీదు బయటికి వచ్చిన వెంటనే యోనాతను దావీదు ఒకరినొకరు ముద్దుపెట్టుకొనుచు ఏడ్చారు. నీకు దేవుడు తోడుగా ఉంటాడు ఏడువ వద్దని యోనాతాను ధైర్యం చెప్పి దావీదుని పంపివేసెను, యోనాతాను ఇంటికి తిరిగి వచ్చెను.

చూశారా పిల్లలూ ! యోనాతాను friend అయిన దావీదుని ఎలా కాపాడాడో .. మనం కూడా మన స్నేహితులు ప్రమాదంలో ఉంటే వారిని రక్షించాలి. మీ friends తప్పు చేస్తుంటే మీకు తెలిసిందనుకోండి, అప్పుడు వారిని హెచ్చరించాలి, చదవకపోయినా, homework చేయకపోయినా మీరు వారిని మందలించడం ద్వారా వారు ప్రమాదంలో పడనట్లేగా ! ఆడుకునేటప్పుడు, బయటికి వెళ్ళినప్పుడు వారికి మేలు చేయాలి. మీరు కూడా యోనాతాను వలె మంచి మిత్రులుగా ఉంటారుగా .....

# “నా జీవితములో దేవుని మేలులు”

ఆనంద్ కుమార్, కృష్ణాజిల్లా

నా పేరు ఆనంద్‌కుమార్, మాది మల్లవోలు, కృష్ణాజిల్లా. నాకు ఒక అన్నయ్య. మా తల్లిదండ్రులు వ్యవసాయం చేస్తారు. అయితే నా తల్లికి వివాహమైన అనేక సంవత్సరముల వరకు సంతానం కలుగలేదు. సంతానం కొరకు అనేకమైన పూజలు చేశారు, గుళ్ళు తిరిగారు కానీ ఏమీ ప్రయోజనం కలగలేదు. అప్పుడు మా అమ్మ యేసుక్రీస్తుని నమ్ముకుంటేనైనా సంతానం కలుగుతుందేమోనని ప్రార్థనా మందిరమునకు వెళ్ళడం జరిగింది. దేవుడు మా అమ్మకు గర్భఫలం అనుగ్రహించారు. మొదట మా అన్నయ్య, తరువాత నేను పుట్టాము. దేవుడు చేసిన అద్భుతమును బట్టి మా అమ్మ దేవుని యందు విశ్వాసం ఉంచింది. అది చూసిన అమ్మమ్మ వాళ్ళు కూడా నిజమైన దేవుడు ఆయనే అని గ్రహించి, వారందరు యేసయ్యను నమ్ముకోవడం జరిగింది. నేను కూడా అమ్మతో పాటు అప్పుడప్పుడు చర్చికి వెళ్తూ ఉండేవాడిని. అలా జరుగుతూ ఉండగా నన్ను ఒక హాస్టల్‌లో జాయిన్ చేశారు. నాకు చదువు సరిగా వచ్చేది కాదు, అన్ని సబ్జెక్టుల్లో తక్కువ మార్కులు వచ్చేవి. అప్పుడు మాస్టర్ బాగా కొట్టేవారు, అందరి ముందు అవమానపరిచేవారు. ఒకరోజు చాలా బాధ కలిగి, చనిపోవాలనిపించింది. ఆత్మహత్యా ప్రయత్నం చేశాను, చనిపోకుండా దేవుడు కాపాడాడు. ఏదో విధంగా నా 10వ తరగతి పూర్తి చేశాను. తరువాత ఐ.టి.ఐలో జాయిన్ అయ్యాను. అప్పుడు ఇంటి దగ్గర ఉండేవాడిని. నాకు దేవుడు అంటే ఇష్టమే కానీ సేవకులంటే ఇష్టం ఉండేది కాదు. ఎందుకంటే ధనాపేక్ష కలిగి ఉన్నారు అనే భావముతో అందరూ అలాగే ఉంటారేమోనని, ఏ చర్చికి వెళ్ళినా నాకు నచ్చేది కాదు. ఏదో వెళ్ళాలి అన్నట్లుగా వెళ్ళి నామకార్థంగా జీవించేవాడిని. అలా ఉంటూ ఐ.టి.ఐ పూర్తి చేసి ఉద్యోగం కొరకు వెదుకుచూ ఉండగా, నవతా ట్రాన్స్‌పోర్ట్‌లో జాబ్ వచ్చింది. అప్పుడు హైదరాబాద్‌లోని వనస్థలిపురం బ్రాంచ్‌లో వేశారు. ఇక్కడ జాబ్ చేస్తూ ఉండగా ఇంటి దగ్గర నుండి తెచ్చుకున్న డబ్బులు అన్నీ పోగొట్టుకొన్నాను, తినడానికి కూడా లేవు, అప్పుడు చాలా బాధపడి ఇంటికి వెళ్ళిపోదామనుకున్నాను కానీ చింతల్‌లో ఉన్న మా బావ, అలాగే అన్నయ్య వాళ్ళకి ఈ సంగతులు చెప్పాను. అప్పుడు మా బావ నువ్వు ఎక్కడికీ వెళ్ళవద్దు. చింతల్‌కు వచ్చేయి, ఇక్కడ ఏదో ఒక జాబ్ వస్తుందిలే అని చింతల్‌కు తీసుకువచ్చారు.

ఇక్కడ ఆదివారం ఆరాధన కొరకు కొన్ని మందిరాలు తిరిగాను కానీ ఆత్మీయంగా ఎక్కడా సంతృప్తి, సమాధానం దొరకలేదు. జాబ్ కొరకు ప్రయత్నం చేయుచున్నప్పుడు ఒక జాబ్ వచ్చింది. ఆ కంపెనీలోని ఒక బ్రదర్ నన్ను 2005వ సం॥లో చింతల్‌లో ఉన్న ఎఫ్రా మినిస్ట్రీస్‌కు నడిపించారు. అప్పుడు ఆరాధన ఒక ఇంటిలో జరిగేది. నేను ముందుగా

చెప్పినట్టుగా నా మనస్సులో ఈ సేవకుడు కూడా ఇంతేనేమో అని అనుకున్నాను. కాని ఆరోజు అక్కడ జరిగిన ఆరాధన మరియు వాక్యం నా హృదయాన్ని ఎంతో హత్తుకొని మార్పుని కలుగజేశాయి. పరిచర్యలో దైవసేవకులు ఏదైతే చెబుతున్నారో దాని ప్రకారం జీవించే విధానం, వారి ప్రవర్తన, ధనాపేక్ష లేని నిస్వార్థమైన మనసు, తగ్గింపు జీవితం చూసి నేను చాలా నేర్చుకున్నాను. అలాగే సంఘంలో కానుకలు పట్టని పద్ధతి నన్ను ఎక్కువ ప్రభావితం చేసింది. దైవసేవకులు జీవించే జీవిత విధానమును, పరిచర్యలో సహోదర ప్రేమ, ఐక్యత, క్రమశిక్షణను బట్టి నా మట్టుకు నేను కూడా వారి వలె దేవుని కొరకు బ్రతకాలనే ఒక తపనను కలుగజేశాయి. నా చెడు ఆలోచనలు, తలంపులు, గర్వం, ద్వేషం, కోపం, విడిచిపెట్టి నా మనస్సు మార్చుకుని 2005వ సం॥లో బాప్తీస్మం తీసుకున్నాను. అలాగే పరిచర్యలో నేను సంతృప్తిగా, సమాధానంగా ఆత్మీయ జీవితంలో ముందుకు వెళ్ళటానికి దేవుడు కృప చూపారు.

2007 సం॥లో జాబ్ నిమిత్తమై దూర ప్రాంతంలో ఉండవలసి వచ్చినప్పుడు నేను ఆత్మీయంగా తగ్గిపోకుండా కొంత మంది సహోదరులు ఫోన్ చేసి నన్ను ఆత్మీయంగా బలపరిచేవారు. అటుతరువాత వివాహ విషయంలో కూడా ఎటువంటి ఆటంకములు లేకుండా దేవుని ఉద్దేశానుసారం, పెద్దల నిర్ణయం ప్రకారం జరగడానికి దేవుడు కృప చూపారు. ఆ వివాహం ద్వారా దేవుడు ఒక కుటుంబముగా మమ్ములను చేసారు. దేవుని యందు విశ్వాసం కలిగి, దేవుని కొరకు జీవించాలి అనే ఆశ కలిగిన భార్యని నాకు అనుగ్రహించారు.

ఇప్పుడు మా ఇద్దరిని దేవుని మందిరపు పరిచర్యలో పాలిభాగస్తులుగా ఉంచిన దేవుని కృపను బట్టి స్తోత్రములు. జీవితకాలమంతా కృతజ్ఞత కలిగి జీవించునట్లుగా మా కొరకు ప్రార్థించగలరు.



# జొనాతన్ ఎడ్వర్డ్స్

ఒక ప్రముఖ ఉజ్జీవమునకు ఉదాహరణ ఒక గొప్ప దైవజనుని ద్వారా అమెరికా దేశంలో వచ్చిన గొప్ప పరివర్తన. ఇది జొనాతన్ ఎడ్వర్డ్ అనే ఒక గొప్ప దైవజనుని పరిచర్యలో మొదలైన గొప్ప మేల్కొలుపు వలన జరిగింది.

1734వ సంవత్సరములో నార్తంప్టన్‌లోని మసచూసెట్స్ పట్టణంలో ఈ దైవసేవకుడు తన మోకాలు మీద మోకరించి తప్పిపోయిన 1100 ఆత్మలను రక్షించాలని దేవునికి మొరపెట్టాడు. దేవునికి భయపడే గత తరం కాలం గతించిపోయింది. క్రొత్త తరం దేవునిని మరిచిపోయింది. జారత్వం, మోసం, స్వయం ఆసక్తి అనేవి పాలించాయి. కొందరు రాబోయే లోకమును గురించి పట్టించుకున్నారు. కనికరం గల దేవుని ప్రేమను గురించి ఎవరూ పట్టించుకోలేదు. చర్చి గోడలు శిథిలమైపోతున్నాయి. అనేక మంది క్రైస్తవులు పాపములో జీవిస్తున్నారు. అనేక సంవత్సరముల నుండి ప్రభువు స్వరాన్ని వినడం లేదు. అప్పుడు ఎడ్వర్డ్ తన స్వంత పట్టణములోని ఆత్మల కోసం గంటల తరబడి మొరపెట్టి ప్రార్థనలో తీక్షణంగా వేచియున్నాడు. అప్పుడు ఒక గొప్ప అద్భుతం జరిగింది. ఎడ్వర్డ్స్ గతములో ఎన్నడూ ప్రసంగించనట్లు ప్రసంగించడం మొదలుపెట్టాడు. ప్రభువు కనికరం అతని హృదయమును నింపగా, మారుమనస్సు పొందమని ఎడ్వర్డ్స్ అనేక మంది ప్రజలను ఆహ్వానించాడు.

క్రైస్తవులు మారుమనస్సు పొందడం మొదలుపెట్టారు. కాలనీలలో, గృహాలలో ప్రార్థన మొదలైంది. దుకాణములు మూయబడ్డాయి. వ్యాపారములు మూతపడ్డాయి. వారు ప్రార్థన కోసం కూడుకున్నారు. మారుమనస్సు వలన కొందరి కళ్ళ నుండి కన్నీళ్ళు కారుతున్నాయి. మరి కొందరు సంతోషం, ప్రేమతో పరవశించారు. ఇతరులు పొరుగువారి ఆత్మలను పట్టించుకున్నారు. అనతికాలములోనే ఉజ్జీవం వారి పట్టణమంతా ప్రాకింది అని రచయిత వ్రాశారు. మైనె నుండి జార్జియా వరకు ఉజ్జీవం వ్యాపించింది. ఆత్మీయ ఆసక్తితో కాలనీలను ఐక్యపరచడంలో ఉజ్జీవం ప్రముఖ పాత్రను పోషిస్తుంది. కాలనీల మధ్య నూతన ఐక్యత, బలమునకు ఇది పునాది వేసింది. ఫలితముగా 1776లో ఒక క్రొత్త దేశం ఆవిర్భానికి దారి తీసింది.

అంతగా అభిషేకం, ఒప్పుదల ఎక్కడ నుండి వచ్చింది? ఆ గొప్ప గమ్యాన్ని చేరడానికి ఎడ్వర్డ్స్‌ను ప్రత్యేకించినదేమిటి? ఎక్కడ గొప్పతనం విత్తనాలు ఉత్పత్తి అయ్యాయి?

అలాంటి పరిపూర్ణ సమాజ పునరుద్ధరణను తెచ్చిన పరిస్థితులు ఏమిటి? ఈ ప్రశ్నలకు జవాబు చెప్పాలంటే మనం ఎడ్వర్డ్స్ అంతర్గత జీవితమును చూడవలసి ఉంటుంది. యేసుక్రీస్తులో దాగియున్న అతని ప్రార్ధనా జీవితమును చూడాలి. యౌవ్వన ప్రాయము నుండి ఎడ్వర్డ్స్ దేవుని సన్నిధి కోసం ఎక్కువ సేపు రహస్యముగా ప్రార్ధనలో గడిపేవాడు. అతడు తరచు పంట పొలాల్లో లేక కొండ మీద ఒంటరిగా నడుస్తూ దేవునితో తీక్షణమైన భారముతో ప్రార్థించేవాడు. దేవుని తియ్యదనం, వెలుగును గురించి లోతైన అవగాహనను కలిగియుండేంత వరకు అతడు పరమ గీతములు పుస్తకమును చదవడానికి ఎక్కువ సమయం కేటాయించేవాడు. తన జ్ఞానేంద్రియముల మీద మరోలోకం నుండి వచ్చిన ఆకస్మిక వెలుగునే దేవుని సన్నిధిగా అతడు అనుభవించాడు. ఎడ్వర్డ్స్ దేవుని నిజమైన సన్నిధితో అన్యోన్యంగా ఉండాలని వెదికాడు గనుక అతడు గొప్పగా వాడబడ్డాడు. వ్యక్తులను కలిపిన ప్రార్ధన కంటే సామూహిక ప్రార్ధన ఎంతో ప్రభావవంతమని అతడు నమ్మాడు.

తన ప్రజలు ప్రార్ధనకు సమర్పించుకుంటే దేవుడు ఏమి చేయగలడో మీరు చూశారా? ఒకవేళ మనం మోకరించి పరిశుద్ధాత్మ కదలిక కోసం బలంగా మొరపెడితే మనం చదివి, వినినదాని కంటే ఎక్కువ చేయడానికి దేవుడు సమర్ధుడని మీరు భావిస్తున్నారా? మీ ప్రాంతములలో ఉజ్జీవమునకు తగిన మూల్యమును చెల్లించడానికి మీరు సిద్ధంగా ఉన్నారా?


## ముఖ్య గమనిక:

మీ ప్రార్ధనావసరతలకై **ఎపఫ్రా మినిస్ట్రీస్** ఆఫీసు నందు
సోమవారం నుండి శనివారం వరకు
ఉదయం 10.30 గం॥ల నుండి సాయంత్రం 6.30 గం॥ల
వరకు సంప్రదించగలరు.

ప్లాట్ నెం.1, శాంతినగర్, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070
Ph: 040-24202227 Cell: 9666666249
email: mail2church@gmail.com

**ఎపఫ్రా మినిస్ట్రీస్ పాటలు మరియు ప్రసంగముల సి.డి.లు**
**కావలసినవారు మమ్ములను సంప్రదించగలరు.**

# ప్రార్థన - ఊపిరి పీల్చుట వంటిదే

## ఆరాధన

ఆరాధన చాలా అమూల్యమైనది, భయభక్తులతో కూడినది, మనలో చాలా లోతైన స్థానం నుండి వస్తుంది. ఇది ప్రభువు ఎదుట మన హృదయములు కుమ్మరింపబడు శక్తివంతమైన మార్గము, మరియు మనము మాటలలో చెప్పలేని ప్రేమ, కృతజ్ఞత, భక్తిని సూచిస్తుంది. యదార్థమైన ఆరాధనను మానవ భాష వివరించలేదు. ఎందుకనగా ఆరాధన చాలా వ్యక్తిగతమైనది, సన్నిహితమైనది, కాబట్టి మనం దానిని మాటలతో నిర్వచించుటకు ప్రయత్నం కూడా చేయలేము.

బైబిల్‌లో ఆరాధనను గూర్చిన తమ నిశిత దృష్టిని, సూచనలను వాక్యభాగములు స్పష్టంగా చెప్తున్నాయి. ఉదాహరణకు

1. యెహోవా నామమునకు తగిన మహిమను ఆయనకు చెల్లించుడి..... పరిశుద్ధాలంకారములగు ఆభరణములను ధరించుకొని ఆయన యెదుట సాగిలపడుడి (1 దినవృత్తాంతములు 16:29)

2. రండి నమస్కారము చేసి సాగిలపడుదము, మనలను సృజించిన యెహోవా సన్నిధిని మోకరించుదము (గౌరవప్రదమైన స్తుతి మరియు విజ్ఞాపనలతో) – కీర్తన 95:6

3. మన దేవుడైన యెహోవా పరిశుద్ధుడు – మన దేవుడైన యెహోవాను ఘనపరచుడి ఆయన పరిశుద్ధ పర్వతము ఎదుట సాగిలపడుడి (కీర్తన 99:9)

4. నీ పరిశుద్ధాలయము తట్టు నేను నమస్కారము చేయుచున్నాను. నీ నామమంతటి కంటే నీ విచ్చిన వాక్యమును నీవు గొప్ప చేసి యున్నావు. నీ కృపాసత్యములను బట్టి నీ నామమునకు కతజ్ఞతాస్తుతులు నేను చెల్లించెదను (కీర్తన 138:2)

## శక్తి యొక్క రీతి :-

స్తుతి వలెనే, ఆరాధన కూడా కేవలం పాటలు పాడుట కంటే ఎంతో ఘనమైనది. నిజం చెప్పాలంటే ఆరాధన అనునది హృదయ స్థితి, మానసిక దశయైయున్నది. ఒక్క చిన్న రాగం కూడా పాడకుండా మనం అపేక్షతో ఆరాధించవచ్చును. ఆరాధన మన హృదయములలో పుడుతుంది. అది మన ఆలోచనలను నింపి, మన శరీరం మరియు నోటి ద్వారా వ్యక్తపరచబడుతుంది. ఉదాహరణకు మనం నాట్యం చేయుట, చప్పట్లు కొట్టుట, చేతులెత్తుట, వాయిద్యములు వాయించుట, దశమ భాగములు, కానుకలు ఇచ్చుట ద్వారా కొన్నిసార్లు మౌనంగా, స్థిరంగా కూర్చొనుట ద్వారా కూడా ఆరాధించవచ్చును. అయితే మన క్రియలు లేక మన స్థితి మన హృదయములను ప్రతిబింబిస్తాయి.

ఆరాధనలోను, ప్రార్థనలోను తరచుగా ఉపయోగించు రీతి మోకాళ్ళపై నుండుట.

మోకాళ్ళపై నుండుట తగ్గింపును సూచిస్తుంది. ఇది ప్రభువుపై సంపూర్ణంగా ఆధారపడి ఉన్న మన హృదయ శబ్ద స్పందనను తెలుపుతుంది. మోకాళ్ళపై నుండుట అంటే దేవునితో “దేవా, నువ్వు నాకు అవసరం. నన్ను నేను నీకు అప్పగించుకొనుచున్నాను. నువ్వు లేకుండా నేను జీవించలేను. నీ కొరకు నేను తృష్ణగొని యున్నాను అని చెప్పుటయే.

శక్తి గల విధానంగా మోకాళ్ళపై ఉండుట అనునది సాతానుకు బలమైన సందేశాన్ని పంపుతుంది. సాతాను దీనిని ద్వేషిస్తాడు. మనం పాట పాడుచున్నప్పుడు వాడు మన హృదయములలో ఏమున్నదో ఎరుగడు, కానీ మనం మోకాళ్ళపై ఉండుట లేక చేతులెత్తుట లేక చప్పట్లు కొట్టుట లేక నాట్యమాడుటను వాడు చూచినప్పుడు భయంతో కంపించిపోతాడు.

అందుకే మనకు అవకాశం ఉన్నప్పుడెల్లా ఏ స్థలములో ఉన్ననూ దేవుడు చేసిన మేలులన్నింటిని తలంచుచూ ఆయన ప్రతి దినమును మనకి అనుగ్రహించి సజీవులనుగా ఉంచినందుకు దేవునికి స్తుతులు చెల్లించడానికి ఇష్టపడి, అలవాటు చేసుకోవాలి. సాతాను స్తుతి, ఆరాధనల వలన ఓడిపోతాడు గనుక వాడు వాటిని ద్వేషిస్తున్నాడు. వాడు ఆరాధనను అంతగా ద్వేషించడానికి కారణం, మొదట వాడు పరలోమందు ఆరాధనను నిర్వహించు దూతగా ఉన్నాడు. వాడు ప్రధాన దూతయైన లూసీఫర్, వాడి శరీరం సంగీత వాయిద్యములతో చేయబడినది. వాడు గర్వించి అతిగా ప్రవర్తించినపుడు దేవుడు వానిని పరలోకం నుండి త్రోసివేశాడు. అప్పుడు వాడు మెరుపువలె ఆకాశము నుండి పడిపోయాడు. (యెషయా 14:12-15 లూకా 10:18) వాడు ఇంకా దేవుని మీద కోపముంచుకొని ప్రజలు ఆయనను నిజంగా ఆరాధించకుండుటకు ఏమైనా చేస్తుంటాడు.

ఆరాధనలలో కొన్నిసార్లు మనము ఉద్రేకపూరితంగా ఉంటాము, కొన్నిసార్లు ఉత్సాహముతోను, ఆసక్తితోనూ, ప్రేరణతోనూ నింపబడతాము. మరికొన్నిసార్లు మౌనంగా ఉంటాము. స్తుతి, ఆరాధనలలో భావవ్యక్తీకరణను బట్టి ఆనందించడం జరుగుతుంది. ఆరాధనలో మనలను మనం వ్యక్తపరచుకొని దేవుని స్తుతించుట కూడా మంచిది.

దేవుని పట్ల హృదయములోని భక్తిని సాధ్యమైన ప్రతిరీతిలోను, భౌతికంగా చెప్పుటకు జీవితములో సాతానుని వెనుకకు త్రోసి, దేవుని యొక్క విజయమును బట్టి సంతోషించునట్లుగా హృదయమంతటితో కీర్తించాలి. దానికి అదనంగా మోకాళ్ళపై నుండడం, చేతులెత్తడం లేక చప్పట్లు కొట్టడం, లేక నాట్యమాడటం ఏదైనా చేయవచ్చు. దేవుడు మనకు ఉద్రేకాలను ఇచ్చాడు. కాబట్టి వాటిని ఆయనను గౌరవించుటకు ఉపయోగించుటకు భయపడవద్దు. మనుష్యులు ఒక బాల్ ఆట చూస్తున్నప్పుడు తమ ఉద్రేకాలను ప్రదర్శించుటను చక్కగా అంగీకరిస్తారు. అయితే స్తుతి ఆరాధనలలో ఉద్రేకాలను ప్రదర్శించుటను “కేవలం ఉద్రేకపూరితంగా” తీర్పు తీర్చుట మంచిది కాదు.

(సేకరించబడింది ) జాయిస్ మేయర్



# లోయలు

**అయ్యాలోను లోయ :-**

యెహోవా ఇశ్రాయేలీయుల యెదుట అమోరీయులను అప్పగించిన దినమున ఇశ్రాయేలీయులు వినుచుండగా యెహోషువ యెహోవాకు ప్రార్థన చేసెను.

సూర్యుడా, నీవు గిబియోనులో నిలువుము

చంద్రుడా, నీవు అయ్యాలోను లోయలో నిలువుము

జనులు తమ శత్రువుల మీద పగ తీర్చుకొను వరకు సూర్యుడు నిలిచెను చంద్రుడు ఆగెను. సూర్యుడు ఆకాశమధ్యమున నిలిచి ఇంచుమించు ఒకనాడెల్ల అస్తమింప త్వరపడలేదు.

**శోరేకు లోయ :- శ్రేష్ఠమైన ద్రాక్షల లోయ**

యెరూషలేము వాయువ్య దిక్కు నుండి ఫిలిష్తీయుల దేశపు ఉత్తర భాగము వరకు వ్యాపించెడి లోయ. ఈ లోయ గుండా ప్రవహించే వాగు, యొప్పేకు దక్షిణముగా 9 మైళ్ళ దూరమున మధ్యధరా సముద్రములో పడును. ఆ వాగును నేటి వరకు శూరారు వాగు అని పిలుతురు గాని ఫిలిష్తీయ బయలు నందు దానికి రూబీను అను పేరు గలదు. యొప్పే నుండి యెరూషలేమునకు పోవు రైలు మార్గమును ఈ లోయ ప్రక్కను వేసిరి. ఇది దెలీలా నివసించిన ప్రాంతం.




# బైబిల్ క్విజ్ -30

**బైబిల్ గురించి ఆసక్తికరమైన అసాధారణ సత్యాలు**

**మీకు తెలిస్తే మాకు వ్రాయండి**

**1. 969 సం॥లు జీవించిన మనిషి ఎవరు ?**

**2. బైబిల్‌ను ఎంత మంది వ్రాశారు ? ఎంత కాలం వ్రాశారు ?**

**3. మిడతలను ఆహారంగా తిన్న వ్యక్తి ఎవరు ?**

**4. బైబిల్‌లో మొత్తం ఎన్ని అధ్యాయాలు కలవు ? పాత నిబంధన ఎన్ని ? కొత్త నిబంధన ఎన్ని?**

**5. రాయిని తలగడగా వాడిన వ్యక్తి ఎవరు ?**

**6. ప్రపంచములో పుస్తకములన్నిటిలో అతి పెద్ద సంఖ్యలో ముద్రించి, అమ్ముడైన పుస్తకం ?**

**7. 12 చేతివేళ్ళు, 12 కాలివేళ్ళు గల వ్యక్తి ఎవరు ?**

**8. బైబిల్‌లో అతి చిన్న అధ్యాయం, అతి పెద్ద అధ్యాయం ఏది ?**

**9. కుక్క వలె నీళ్ళను గతికిన మనుష్యులు ఎవరు ?**

**10. ఒక దినమంతా సూర్యుడు అలాగే నిలిచిపోయాడు, ఎక్కడ వ్రాయబడింది ?**

ఈ ప్రశ్నలకు సరైన సమాధానములు అక్టోబర్ 15వ తేదీ లోపు మాకు వ్రాసి పంపించండి. సరైన సమాధానములు వ్రాసిన వారి పేర్లు నవంబర్ 2013 పత్రికలో ప్రచురించబడతాయి.

**పంపవలసిన చిరునామా :- ఎడిటర్ - స్పర్శ,** ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.6, భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070.

**<u>బైబిల్ క్విజ్ - 29 జవాబులు ప్రకటన గ్రంథం :</u>**

| | |
|---|---|
| **1**. ఎఫెసీ సంఘం 2 :4 | **2**. సుగంధం 21:20 |
| **3. యెజెబెలు 2**:20 | **4.** 1000 సం॥లు 20:2 |
| **5. యేసుక్రీస్తు 5**:5 | **6.** మహాబబులోను 18:10 |
| **7.** యూఫ్రటీసు మహానది 9:14 | **8.** ఫిలదెల్ఫియ 3:10 |
| **9. లవొదికయ సంఘం3**:16 | **10.జీవకిరీటము** 2:10 |

**<u>బైబిల్ క్విజ్ - 29 ప్రశ్నలకు సరియైన జవాబులు వ్రాసి పంపిన వారి పేర్లు :</u>**

కోమలి, ఐజాక్ కుమారి, త్రినాధరావ్, రాజు, ఫ్లోరెన్స్‌రాజు, షీబా, జాన్‌పాల్, హానోకు,కనికరమ్మ, ఎస్తేరు, చంద్రకళ, ఆశాకిరణ్, సౌజన్య, పాల్‌రాజ్

# జన్మదిన శుభాకాంక్షలు

క్రీస్తునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.
తండ్రియైన దేవుని నుండి కృపయు, సమాధానము మీకు కలుగును గాక !
ఈ పత్రిక ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము.

**" నీ దేవుడైన యెహోవా కన్నులు సంవత్సరాది మొదలుకొని సంవత్సరాంతము వరకు ఎల్లప్పుడు మీ జీవితముల మీద ఉండును గాక ! "**

## సెప్టెంబర్ - అక్టోబర్

**భాగ్యలత** : సందీప్, ఇందిరా ప్రియ, ఐజాక్, ప్రసాద్, జ్యోతి, ప్రియాంక, సుధ, శ్రీలక్ష్మి, షాలేం, కిరణ్‌కుమార్, మాధురి, ప్రేమ్‌కుమార్, దీవెన, చెన్నకేశవరెడ్డి, ప్రదీప్‌కుమార్, స్వరూప్, హోసన్న, అరుణ, రాణి, శేఖర్, ప్రజ్ఞ, అనిత, అన్నపూర్ణ, ప్రీతి, నిర్మల, ఉషారాణి, ఫిలిప్పు, సాల్మన్‌రాజు, మాధవి, శామ్సన్, ఏసుబాబు, దీపిక, షారోను, ప్రియదర్శిని, సూర్యరాజు, మల్లేశ్వరి, సైమండ్, సుధారాణి, ప్రణీత్‌కుమార్, ప్రసన్నకుమార్, దివ్యదీపిక, సంజయ్‌రాజు, రవికుమార్ (మిర్యాలగూడ), వాసుదేవరావు, శ్రేయస్, కవిత, సుజాత, టైటస్, జయశ్రీ, పుష్పలత, భద్రరావు, సుధావల్లి, ఒలివ్‌షారోన్, బ్యూలా, జ్యోతి, చంద్రవర్మ, హెప్సిబా, జోసఫ్, స్పర్జన్, దీవెన,glaedy సాయికుమార్, నవ్య, రిక్విన్‌రాజ్, పద్మశ్రీ, సలోమి, రిత్విక్‌కేష్, ఉదయశ్రీ, అనిత, విజయ్‌కుమార్, విజయకుమారి, రామలక్ష్మి, సుష్మ, రామకృష్ణ, సృజన్, సీమోన్, లక్ష్మి, శిరీష, వెంకటరాములు, కవిత, వినిత, ప్రత్యూష, గౌతమి, విజయ, షైనీజ్యోతి, నవీన్‌కుమార్, ప్రసన్నరాణి, అభిజ్ఞ, స్రవంతి, హర్షిత, సుహాసిని, సాహిత్, రేణుక, ప్రగతి, విజయలక్ష్మి, సాయికస్తూరి, చంద్రకళ

**చింతల్** : జయమ్మ, సుధాకర్, సోనురాజ్, ప్రసాద్, శ్యామ్,శేఖర్, కళ్యాణ్, కృష్ణవేణి, ఎఫ్రాయిము, రాజేష్, పద్మజారాణి, పవన్‌కుమార్, సునీల్‌కుమార్, త్రిమూర్తులు, భవాని, రాజు, నరేంద్ర, ప్రమీల, రాజేష్, దుర్గాప్రసాద్, వేణుకుమారి, శ్రీహర్షవర్మ, మీనా, సంధ్య, ఇందిరాజ్యోతి, సాగర్, విశేష,

**అనాజ్‌పూర్** : వరప్రసాద్, కళ్యాణ్ కుమార్, రామారావు, సుష్మ, మమత, చంద్రకళ

**ఇ.సి.ఐ.యల్** : సుజని, సుకుమార్

**"స్పర్శ"** అనే మన ద్వమాస పత్రిక సంవత్సర చందా రూ. 100/- లు, జీవితకాల చందా రూ. 2000/- లు మరియు విదేశములకు సంవత్సరమునకు **US $ 40.**

చందాదారులు కావలసిన వారు **ఎపఫ్రా మినిస్ట్రీస్ ట్రస్ట్, హైదరాబాద్** (Epaphras Ministries Trust, Hyderabad) పేరున **డి.డి/మనిఆర్డర్** తో పాటు మీ పూర్తి వివరములు ఈ ఫారములో నింపి మా చిరునామాకు పంపించగలరు.

1. పూర్తి పేరు: ____________________

2. చిరునామా: ____________________

____________________

____________________

పిన్ కోడ్: ____________________

**మీ ప్రార్థనావసరతలు:**

____________________

____________________

____________________

____________________

మా చిరునామా:

**ఎపఫ్రా మినిస్ట్రీస్,** ప్లాట్ నెం. 1, శాంతి నగర్, వాటర్‌ట్యాంక్ ఎదురుగా, భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్-70, ఫోన్: 040-2420 2227



2013 ఆగష్టు 15 వ తేది - హైదరాబాద్ - హయత్ నగర్, ధనుంజయ గార్డెన్స్ నందు
జరిగిన ఉపవాస ప్రార్ధనలో ఆసక్తి కలిగిన వారు పాల్గొని భక్తిశ్రద్ధలతో దేవునిని ప్రార్ధించడం జరిగినది.

**2013 ఆగష్టు, 15 వ తేది జరిగిన ఉపవాస ప్రార్థనలో సండేస్కూల్ పిల్లలు వారి తల్లిదండ్రులు పాల్గొని దేవునిని మహిమ పరచడం జరిగినది.**





# ఎపఫ్రా మినిస్ట్రీస్

ప్లాట్ నెం.1, శాంతినగర్, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070
Ph: 040-24202227 Cell: 9666666249
email: mail2church@gmail.com | web: www.epaphra.org

*Published by:* T.Epaphras, Plot No.1, Shanti Nagar, Opp.Water Tank, Bhagyalatha Colony, Vanasthalipuram-500070, Hyderabad.
*Printed by:* Vamsi Art Printers, Lakdikapool, Hyderabad (AP) | *Editor:* Bro. T.Epaphras